సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
సోమవారం | 9 | జూన్ | 2025



బాబు మార్కు రాజకీయానికి బలి!
సుగవాసి బాలసుబ్రమణ్యం తెలుగుదేశం పార్టీకి గుడ్‌బై చెప్పడంతో.. చంద్రబాబు నా యుడు రాజకీయంలో మరో నేత బలయ్యారు.
-8లో



అల్లుడి హత్య కేసులో నిందితుల అరెస్టు
కడప నగరంలో సయ్యద్ చాంద్ బాషా అనే యువకుడిని తాళ్లతో కట్టేసి క్రూరంగా హత్య చేసిన కేసులో నిందితులను అరెస్టు చేశారు.
-8లో

గరిష్టం/కనిష్టం
39.2/29.0

వాతావరణం
జిల్లాలో ఆదివారం 29.0 - 39.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ కలెక్టర్'

కడప సెవెన్‌రోడ్స్: డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో విజ్ఞప్తి చేశారు

నేడు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లావ్యాప్తంగా స్వచ్ఛభారత్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఆయా గ్రామ పంచాయతీల వారీగా పెండింగ్‌లో ఉన్న జీతాలు తక్షణమే ఇవ్వాలంటూ స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనుంది.దీనిని జయప్రదం చేయాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ. 10,000 అమలు చేయాలన్నారు. కార్మికులకు పని చేసేందుకు అవసరమైన పనిముట్లు, రక్షణ దుస్తులు అందించాలన్నారు.

కాల్ సెంటర్ 1100 సేవలు వినియోగించుకోండి

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలన్నారు.

సభాభవన్‌లో పీజీఆర్‌ఎస్ నిర్వహణ

కడప సెవెన్‌రోడ్స్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్)ను ఈ సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలను meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునన్నారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాల్లో కూడా సమర్పించుకోవచ్చునన్నారు.

1340 మెట్రిక్ టన్నుల యూరియా రాక



రైలు వ్యాగిన్ నుంచి లారీలకు యూరియా లోడ్ చేస్తున్న కూలీలు

కడప అగ్రికల్చర్: ఉమ్మడి కడపజిల్లాకు 1340 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చినట్లు జిల్లా జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు తెలిపారు. ఇందులో కడప జిల్లాకు 950 మెట్రిక్ టన్నులు రాగా ఇందులో 550 మెట్రిక్ టన్నులను ప్రైవేటు డీలర్లకు, 400 మెట్రిక్ టన్నులు మార్కెఫెడ్‌కు కేటాయించి నట్లు తెలిపారు. అలాగు అన్నమయ్యజిల్లాకు 390 మెట్రిక్ టన్నులు రాగా ఇందులో 120 మెట్రిక్ టన్నులు ప్రైవేటు డీలర్లకు, 270 మెట్రిక్ టన్నులు మార్కెఫెడ్‌కు కేటాయించినట్లు ఆయన తెలిపారు.

అల్ట్రాటెక్‌కు ఆది ఉరి!



అల్ట్రాటెక్ పరిశ్రమలోకి వెళ్తున్న కార్మికులను అడ్డుకుంటున్న ఎమ్మెల్యే అనుచరులు



అల్ట్రాటెక్ పరిశ్రమ వద్ద టెంటు ఏర్పాటు చేసుకోని తిష్టవేసి ఉన్న ఎమ్మెల్యే వర్గీయులు

- పరిశ్రమలో కొనసాగుతున్న కూటమి ఎమ్మెల్యే ఆది నియంతృత్వం
- నాడు తక్షణం స్పందించిన కలెక్టర్, సీఎంఓ ఆపై మౌనవ్రతం
- చుట్టుపక్కల గ్రామస్తులతో పరిశ్రమపై ఫిర్యాదులు
- సున్నపురాయి సరఫరా చేసే ట్రాన్స్‌పోర్టు వాహనాలపై కేసులు
- రౌడీషీటర్లతో తిష్టవేయించి ముప్పుతిప్పలు పెడుతున్న వైనం

సాక్షి ప్రతినిధి, కడప: అల్ట్రాటెక్ సిమెంట్ ఉత్పత్తి 40రోజులుగా నిలిచిపోయింది. పరిశ్రమకు కూటమి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి. కార్మికులు పరిశ్రమలోకి వెళ్లకుండా మనుషులను పెట్టి అడ్డుకుంటున్నారు. ప్యాకింగ్ ప్లాంట్ ఆధీనంలో పెట్టుకొని ముప్పుతిప్పలు పెడుతున్నారు. ప్యాకింగ్ యూనిట్ రన్నింగ్‌లో లేకుండా పోవడంతో ఉత్పత్తి నిలిచిపోయింది. నాడు విషయం తెలియగానే ఆగమేఘాలపై స్పందించిన సీఎంఓ, జిల్లా కలెక్టర్ తర్వాత నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. పైగా 70:30 నిష్పత్తితో వాటాలు ఇవ్వాలంటూ పొలిటికల్ తీర్మానం చేసినట్లు తెలుస్తోంది.

- చిలంకూరు అల్ట్రాటెక్ సిమెంటు పరిశ్రమపై పైచేయి సాధించాలనే దిశగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చేయని దౌర్జన్యమంటూ లేదు. ఎలాంటి సమస్యలు సృష్టించినా యాజమాన్యం దిగిరాకపోవడంతో మరింతగా రెచ్చిపోతున్నారు. పక్షం రోజులుగా వలసపల్లె, కర్చుకుంటుపల్లె, తుమ్మలపల్లె, దేవగుడి గ్రామాలకు చెందిన రౌడీషీటర్లతో పాటు ఎమ్మెల్యే వర్గీయులు పరిశ్రమ ప్రధాన గేటు వద్ద తిష్టవేసి కార్మికులను వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. 24/7 అక్కడే తిష్టవేసి వండుకొని తినడం, కార్మికులను అడ్డుకోవడం ఇదే పనిగా పెట్టుకున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని క్షేత్రస్థాయిలోని అధికారులను ఉసిగొల్పి ముడిఖనిజం సరఫరా చేసే టిప్పర్లను అడ్డుకున్నారు. ప్యాకింగ్ ప్లాంట్ కాంట్రాక్టు అనుచరులకు ఇప్పించుకొని యాజమాన్యంతో సంబంధం లేకుండా కార్మికులను వెనక్కి పిలిపించారు. వెరశి 40రోజులుగా ప్యాంకింగ్ ప్లాంట్ ఆగిపోయింది. ప్యాకింగ్ ప్లాంట్ రన్నింగ్‌లో లేకపోవడంతో సిమెంటు ఉత్పత్తి నిలిచిపోయింది.



అధికారికంగా దెబ్బకొట్టే యత్నం విఫలం...

అల్ట్రాటెక్ పరిశ్రమలో ఉపాధి ఉద్యోగ అవకాశాల్లో స్థానికులకు ప్రాధాన్యత లేదు. కాలుష్య నియంత్రణ సక్రమంగా చేపట్టడం లేదు. చుట్టుప్రక్కల గ్రామాలల్లో అభివృద్ధి పనులు ఏవి లేవంటూ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తన అనుచరుల ద్వారా ఫిర్యాదు చేయించారు. విచారణ చేపట్టిన యంత్రాంగం అల్ట్రాటెక్ సిమెంట్ ప్యాక్టరీలో 89 శాతం మంది ఉద్యోగులు స్థానికులు ఉన్నారు. మరోవైపు నష్టాల్లో ఉండడంతోనే ఐసీఎల్ యాజమాన్యం అల్ట్రాటెక్ సంస్థకు పరిశ్రమను అప్పజెప్పింది. ఇలాంటి తరుణంలో సీఎస్‌ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ) గ్రాంట్ ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు వెచ్చించలేనట్లు తెలుస్తోంది. కాలుష్య నియంత్రణకు తీసుకున్న చర్యలు సైతం వివరించినట్లు సమాచారం. రికార్డు పరంగా సక్రమంగా ఉన్నప్పటికీ తామేమి చేయలేమంటూ కలెక్టర్ చేతులెత్తేసినట్లు సమాచారం. మరోవైపు సిఎంఓ సైతం పొలిటికల్ వాటాలు ఇవ్వాల్సిందిగా సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. వెరశి అల్ట్రాటెక్ సిమెంటు పరిశ్రమ ఉత్పత్తి నిలిచిపోయింది.

40 ఏళ్లల్లో ఇలాంటి దుశ్చర్యలు తొలిసారి

సిమెంట్ పరిశ్రమలకు ముడి ఖనిజం సరఫరా చేసే టిప్పర్లు అధిక లోడుతో వెళ్తున్నాయని సీజ్ చేయడం, గేటు బయట రౌడీలను పెట్టి కార్మికులను పరిశ్రమలోకి వెళ్లకుండా అడ్డుకోవడం, యాజమాన్యంతో నిమిత్తం లేకుండా ప్యాకింగ్ ప్లాంట్ మూత వేయించడం 40ఏళ్ల చరిత్రలో ఇలాంటి దుశ్చర్యలు తొలిసారి తెరపైకి వచ్చినట్లు అల్ట్రాటెక్ యాజమాన్య ప్రతినిధులు వాపోతున్నారు. రాజకీయ నేతల కారణంగా వారి డిమాండ్లు నెరవేర్చలేదనే నెపంతో 40 రోజులుగా ప్లాంట్ ఉత్పత్తి నిలిపివేయడం కూడా తొలిసారి ఎమ్మెల్యే ఆది నేతృత్వంలోనే చోటుచేసుకున్నట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

భవిష్యత్తు తరాలకు దిక్సూచిలా 'యోగా'

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



యోగాలో ఆసనాలు స్వీయప్రదర్శన చేస్తున్న జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్

కడప అర్బన్: యోగా భవిష్యత్తు తరాలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు దరిచేరకుండా ఓ అద్భుతమైన మార్గదర్శి, 'దిక్సూచి' లా పని చేస్తుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదని జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏ.ఆర్, సివిల్, ఇతర విభాగాలు, ఏపీఎస్పీ అధికారులు, సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన 'యోగాంధ్ర – 2025' కార్యక్రమానికి జిల్లా ఎస్.పి ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విధుల్లో మానసిక ఒత్తిడికి గురయ్యే పోలీస్ సిబ్బంది అనారోగ్య సమస్యలు రాకుండా యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకుని సంపూర్ణ ఆరోగ్యం తో జీవించవచ్చని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో మానసిక దృఢత్వానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆయుష్ విభాగం నుండి హాజరైన యోగా శిక్షకులు ప్రసాద్, జ్యోతి లకు జిల్లా ఎస్.పి పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్, కడప డీఎస్పీ ఏ.వెంకటేశ్వర్లు, ప్రొద్దుటూరు డీఎస్పీ.భావన, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, పులివెందుల డీఎస్పీ బి.మురళినాయక్, ఆయుష్ డి స్ట్రిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ మురళి పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

జిల్లాలో మాదక ద్రవ్యాల నిరోధానికి తమ వంతు క్రియాశీల పాత్ర పోషిస్తామని పోలీస్ అధికారులు, సిబ్బందితో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రతిజ్ఞ చేయించారు. ఆదివారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లోని యోగాంధ్ర వేదికపై ఈగల్ (ఎలైట్ యాంటి–నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్ మెంట్) ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. 'మాదక ద్రవ్యాల అక్రమ రవాణా,దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియచేస్తానని డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరిస్తానని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వాములు అవుతామంటూ' సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

మాన్యువల్ విధానంలోనే బదిలీలు జరపాలి



డీఈఓ కార్యాలయ ముట్టడి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా

- ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసిన ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక
- డీఈఓ కార్యాలయం ముట్టడి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలను మాన్యువల్ విధానంలోనే జరపాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశాయి. అలా కాని పక్షంలో ఎంత దూరమైనా పోవడానికి సిద్ధమని ప్రభుత్వానికి అల్టీమేటం జారీ చేశాయి. జిల్లాలో ఎస్టీటీలకు వెబ్ కౌన్సిలింగ్ వద్దు.. మ్యానువల్ ముద్దు అనే నినాదంతో ఆదివారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. మాన్యువల్ కౌన్సెలింగ్ జరపాలనే ఏకైక నినాదంతో జిల్లా నలుమూలల నుంచి వందల సంఖ్యలో ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార విషయమై గతంలో సంఘాలు ధర్నాకు పిలుపును ఇచ్చినప్పుడు కమిషనర్ మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ జరుపుతామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పుడు మాట తప్పి ఆన్‌లైన్ ద్వారా కౌన్సెలింగ్‌లో వెబ్ ఆప్షన్ ఇచ్చుకోవాలని ప్రకటించడం సబబుగా లేదన్నారు. గతంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు మోపురు శివారెడ్డి, ఇలియాస్‌బాషా, నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి, సురేష్ బాబు,గుజ్జల తిరుపాల్,బండి విశ్వనాథరెడ్డి,లక్ష్మి రాజా, పాలేం మహేష్, శ్యాంసుందర్ రెడ్డి, ఖాదర్ బాషా, చెన్నయ్య, కొండారెడ్డి, ఐత్తిని నాగేశ్వరరావు, రామాంజనేయులు, ప్రవీణ్ కిరణ్, శివశంకర్ రెడ్డి,సజ్జల రమణారెడ్డి, చంద్రోశేఖర్ రెడ్డి, ఏబీ రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

- ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ నేడు డీఈఓ కార్యాలయ వద్ద చేపట్టనున్న నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం కడపలోని డీఈఓ కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

11న రాజంపేటలో ఢిల్లీరైలుకు హాల్టింగ్

రాజంపేట: రాజంపేట రైల్వేస్టేషన్‌లో ఈనెల 11న ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రైల్వే అధికారులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిని ఆహ్వానించారు. ఆదివారం ఆకేపాటికి ఆహ్వానపత్రికను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీలు పీవీ మిథున్‌రెడ్డి, మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్సీలు భూమిరామిరెడ్డి గోపాల్ రెడ్డి, పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, పీ.చంద్రశేఖరరెడ్డి, శ్రీకాంత్. జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి, డిప్యూటీ చైర్మన్ జకియాఖాన్, మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి ఢిల్లీ రైలు స్టాపేజి కార్యక్రమానికి హాజరవుతరన్నారు. ఆకేపాటిని కలిసిన వారిలో గుంతకల్ రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెం భరత్ కుమార్‌రెడ్డి, కడప కమర్షియల్ సూపర్‌వైజరు జనార్ధన్ తదితరులు ఉన్నారు.



ఆకేపాటికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న రైల్వే అధికారులు



ఏపీ ఈఏపీ సెట్‌లో మెరిశారు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో గత నెల 19 నుంచి 27వ తేదీ వరకు జరిగిన ఏపీ ఈఏపీ సెట్ ఫలితాలు ఆదివారం సాయంత్రం విడుదలయ్యాయి. ఇందులో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. ఉత్తమ్మ ర్యాంకులు సాధించి పలువురి ప్రశంసలు పొందారు.

ఇంజనీరింగ్ విభాగంలో...

జిల్లాలో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 13084 మంది రిజిస్టర్ చేసుకోగా 12554 మంది పరీక్షలు రాయగా ఇందులో 8545 మంది క్వాలిఫై అయ్యారు. ఇందులో బాలురు 4931 మంది, బాలికలు 3614 మంది క్వాలిఫై అయ్యారు.

అగ్రికల్చర్,ఫార్మసీకి సంబంధించి...

అగ్రికల్చర్ అండ్ ఫార్మాసీకి సంబంధించి జిల్లాలో 3424 రిజిస్టర్ చేసుకోగా 2286 మంది పరీక్ష రాశారు. ఇందులో 2835 మంది క్వాలిఫై అయ్యారు. బాలురు 804 మందికాగా బాలికలు 2031 మంది ఉన్నారు.

రాష్ట్రస్థాయిలో జశ్వంత్‌రెడ్డికి 16వ ర్యాంకు

ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో కడప భాగ్యనగర్ కాలనీకి చెందిన మొలకల జశ్వంత్‌రెడ్డి మెరిశాడు. రాష్ట్రస్థాయిలో 16వ ర్యాంకు సాధించి భళా అనిపించాడు. మొలకల రాజకిషోర్‌రెడ్డి, శ్రీలతల కుమారుడు జశ్వంత్‌రెడ్డి 1 నుంచి 5వ తరగతి వరకు కడప నారాయణ ఈ టెక్నో స్కూల్లో చదివాడు. 6 నుంచి 10వ తరగతి వరకు నారాయణ ఒలంపియాడ్‌లో చదివాడు.ఇంటర్మీడియట్‌ను విజయవాడ కానూర్‌లోని నారాయణలో పూర్తి చేశాడు. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌లో 211వ ర్యాంకు సాధించాడు. గతంలో విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో 777వ ర్యాంకు సాధించాడు. దీంతోపాటు విట్‌లో 36వ ర్యాంకు, తెలంగాణా ఎంసెట్‌లో 38వ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. జశ్వంత్‌రెడ్డి ర్యాంకు రావడంతో తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ రాజకిషోర్‌రెడ్డి సొంత గ్రామం వీరపునారయణపల్లె మండలం అనిమెల గ్రామం. అయితే ఆయన కడపలో స్థిరపడ్డారు. రాజకిషోర్‌రెడ్డి ప్రస్తుతం విజయవాడ డైరెక్టర్ ఆఫ్ అనిమల్ హస్బండీరీ లో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్నారు.



జశ్వంత్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

మెరిసిన కృష్ణహర్షిత్

ఏపీ ఈఏసీ సెట్ ఫలితాల్లో కడప ఎన్‌జీఓ కాలనీకి చెందిన మంచాల కృష్ణ హర్షిత్ రాష్ట్రస్థాయిలో 37వ ర్యాంకును సాధించి మెరిశాడు. మంచాల ఈశ్వర్, రాధికల కుమారుడు కృష్ణహర్షిత్ చదువులో బాగా రాణిస్తూ ఇటీవల విడుదలైన ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కూడా 197వ ర్యాంకును సాధించాడు. చెన్నై ఐఐటీలో ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి.. సాఫ్ట్‌వేర్ రంగంలో అత్యున్నత స్థాయి ఉద్యోగాన్ని సాధించడమే లక్ష్యమని పేర్కొన్నారు. కృష్ణ హర్షిత్ తండ్రి మంచాల ఈశ్వర్ సిద్దవటం మండలం మాధవరం జెడ్పీ హైస్కూల్లో మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్నాడు. కృష్ణ హర్షిత్‌కు ర్యాంకు రావడం పట్ల తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



తల్లిదండ్రులతో కృష్ణహర్షిత్

క్లుప్తంగా

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

చాపాడు : మండలంలోని బద్రిపల్లె గ్రామానికి చెందిన ఏనుగు సావిత్రి (40) ఆదివారం కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. ఆస్తమా వ్యాధితో బాధపడుతున్న సావిత్రి ఈ నెల 3న పురుగుల మందు తాగింది. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త లక్ష్మీరెడ్డి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జర్మనీలో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం


భోగం హరీష్‌కుమార్

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో కంప్యూటర్ సైన్స్ చదివిన పూర్వ విద్యార్థి భోగం హరీష్‌కుమార్ వరల్డ్ ఓపెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈనెల 11వ తేదీన జర్మనీలో నీ కెమ్నిట్జ్‌లో వరల్డ్ ఓపెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. భోగం హరీష్‌కుమార్ 83 కిలోల ఓపెన్ విభాగంలో పాల్గొననున్నారు. ఇతనికి ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా, పవర్ లిఫ్టింగ్ కోచ్ బాల గోవిందు తివారి అభినందనలు తెలిపారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి


ఓబులేసు మృత దేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి


ఓబులేసు (ఫైల్)

కమలాపురం : మండల పరిధిలోని కొండాయపల్లెకు చెందిన ఉపాధి కూలీ చిట్టిబోయిన ఓబులేసు (62) వడదెబ్బతో మృతి చెందినట్లు ఏపీఓ పార్థసారధి తెలిపారు. శనివారం ఉపాధి పనికి వెళ్లి ఇంటికి వచ్చిన ఓబులేసు కళ్లు తిరుగుతున్నాయని కుటుంబ సభ్యులకు చెప్పాడు. చికిత్స నిమిత్తం కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, వివాహిత కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. కాగా, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ఆదివారం మృతుని నివాసానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథ శర్మ తనయుడు మణికంఠ శర్మ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వ్యక్తి ఆత్మహత్య

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణానికి చెందిన కుతుబుద్దీన్ (40) అనే వ్యక్తి విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణం రవిహాల్ వెనుక భాగంలో నివాసం ఉండే కుతుబుద్దీన్ రోజు వారి కూలికి వెళతాడు. వచ్చిన కూలి డబ్బులతో పూటుగా మద్యం తాగేసి కుటుంబాన్ని పట్టించుకోనేవాడు కాదు. దీంతో చేసేది లేక అతని భార్య తన నలుగురు పిల్లలతో కలసి వేరుగా కాపురం ఉంటోంది. దీంతో మనస్తాపానికి గురై శనివారం రాత్రి మద్యంతో పాటు విషద్రావణం తాగి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. ప్రాథమిక చికిత్స చేస్తుండగానే మృతి చెందాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


బాబు మార్కు రాజకీయానికి.. ఆ ముగ్గురు బలి!

- యూజ్ అండ్ త్రో పాలిట్రిక్స్
- రాజంపేటలో ఇన్‌చార్జి రగడ
- క్యాడర్‌లో అధిష్టానంపై సన్నగిల్లుతున్న నమ్మకం


పసుపులేటి బ్రహ్మయ్య


బత్యాల


సుగవాసి



రాజంపేట : గత సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన సుగవాసి బాలసుబ్రమణ్యం ఓటమిపాలై, పార్టీలో ఎన్నో అవమానాలు ఎదుర్కొని..ఇన్‌చార్జి పదవి విషయంలో అధిష్టానం వెనకడుగు వేసిన తరుణంలో ఆయన ఆ పార్టీకి గుడ్‌బై చెప్పడంతో.. చంద్రబాబు రాజకీయంలో మరో నేత బలయ్యారనే వాదన ఆ పార్టీ క్యాడర్‌లో వినిపిస్తోంది. దివంగత మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు బాటలో సుగవాసి కూడా చేరిపోయారనేది ఇప్పుడు కూటమి వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

యూజ్ అండ్ త్రో పాలిట్రిక్స్..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాలానుగుణంగా రాజకీయాలు చేస్తారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో ఉంది. వాడుకోవడం పక్కన పెట్టడం, విభజించి పాలించడం లాంటి విధానాలతో రాజంపేట టీడీపీ వర్గ విభేదాలకు నిలయంగా మారిపోయిందని రాజకీయ పరిశీలకుల భావన. కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకున్న నేతలను తన కష్ట కాలంలో బాగానే ఉపయోగించుకున్నప్పటికి, అందలమెక్కిన తర్వాత వారిని డస్ట్‌బిన్‌లో వేసే విధానం పార్టీ ఆవిర్భావం నుంచి రాజంపేట టీడీపీలో కొనసాగుతోందన్న విమర్శలున్నాయి.

అయ్యో.. పసుపులేటి బ్రహ్మయ్య..

రాజంపేట తెలుగుదేశం పార్టీ రాజకీయాల్లో వెలుగు వెలిగిన నేత బలిజ సామాజికవర్గానికి చెందిన పసుపులేటి బ్రహ్మయ్య. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌తోపాటు చంద్రబాబునాయుడు పాలనలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన అపార అనుభవం కలిగిన నేత. 1994, 1999లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2012 ఉప ఎన్నికల్లో ఓటమిపాలవుతారని తెలిసి కూడా, పార్టీ తరఫున పోటీ చేసేందుకు ఎవ్వరూ ముందుకురాకపోతే పసుపులేటి బ్రహ్మయ్య పోటీ చేసి ఘోరంగా ఓడిపోయారు. అన్ని విధాలుగా నష్టపోయారు. మానసికంగా ఆందోళనకు గురయ్యారు. ఆ తర్వాత అనారోగ్యంతో మృతి చెందారు. అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రహ్మయ్య గురించే పట్టించుకోలేదన్న అంశం బహిరంగ అంశం. ఆయన వర్గీయులు చెట్టుకొకరు పుట్టకొకరు పోయారు. ఆయన తనయులకు రాజకీయంగా చంద్రబాబు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదనే వాదన ఉంది.

రాజకీయ ప్రయోగంలో బత్యాల బలి..

రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలలో బలిజ సామాజిక వర్గాల్లో పట్టుకల్గిన నేత బత్యాల చెంగల్రాయుడు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో బత్యాల చెంగల్రాయుడుకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారు. ఆ పదవి తప్ప మరో పదవి రాలేదు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట నుంచి టీడీపీ తరఫున పోటీ చేసే నాథుడు కరువైన దుస్థితిలో రైల్వేకోడూరు నుంచి బత్యాలను తీసుకొచ్చి రాజంపేట నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయించారు. వైఎస్సార్‌సీపీ చేతిలో ఘోరంగా ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత బత్యాల రాజంపేట రాజకీయాలకు దూరమయ్యారు. గత సార్వత్రిక ఎన్నికల్లో రైల్వేకోడూరుకే బత్యాలను పరిమితం చేశారు.

అధిష్టానంపై సన్నగిల్లుతున్న నమ్మకం..

టీడీపీకి పనిచేసిన సీనియర్లకు, కార్యకర్తలకు అధిష్టానం వైఖరిపై నమ్మకం సన్నగిల్లుతోంది. తమను వాడుకోవడమే కానీ, తమకు చేసేదేమీలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పసుపులేటి బ్రహ్మయ్య, బత్యాల చెంగల్రాయుడు, సుగవాసి బాల సుబ్రమణ్యంలు రాజకీయ వ్యవహారంలో సమిధలుగా మారిన తీరుతెన్నులను తమ్ముళ్లు నిశితంగా పరిశీలిస్తున్నారు. రాజంపేటలో టీడీపీకి బలిజ సామాజిక వర్గం అండగా ఉంటూ వస్తోంది. అయితే ఇప్పుడు ఆ సామాజిక వర్గనేతలకు జరుగుతున్న అన్యాయాన్ని బలిజలు దిగమింగుకోలేకున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ పార్టీ రాదన్న ఆందోళన, టీడీపీకి వస్తున్న ప్రజావ్యతిరేకతను చూసి తమ్ముళ్లు సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.

ఇన్‌చార్జి ఫైనల్‌పై అధిష్టానం కసరత్తు..

టీడీపీ ఎన్నికల అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం గుడ్‌బై చెప్పడంతో రాజంపేట టీడీపీ వర్గాలు కుదేలయ్యాయి. అధికారంలోకి వచ్చిన ఏడాదికే టీడీపీకి షాక్ తగిలే సరికి అధిష్టానం ఉలిక్కిపడిందని కొందరు నేతలు అంటున్నారు. ఇన్‌చార్జి విషయంలో తేల్చాలనే నిర్ణయానికి అధిష్టానం వచ్చేసింది. ఇప్పటికే ఇన్‌చార్జి రేసులో చమర్తి జగన్‌మోహనరాజు, మేడా విజయశేఖర్‌రెడ్డి ఉన్నారు. తాజాగా బత్యాలకే ఇన్‌చార్జి ఇవ్వాలని, చమర్తి రాజకీయాన్ని వ్యతిరేకిస్తూ తమ్ముళ్లు ఆత్మీయ సమావేశాలు పెట్టుకొని అధిష్టానానికి అల్టిమేటం ఇస్తున్నారు. ఎవరంతట వారు తమ నేతకే ఇన్‌చార్జి అని చెప్పుకుంటున్నారు. మరోవైపు ఇన్‌చార్జి కుర్చీ రెడ్డి సామాజికవర్గానికి అప్పగించాలని టీడీపీ అధిష్టానం అడుగులు వేస్తోందనే ప్రచారం ఆ పార్టీ వర్గాల్లో జరుగుతోంది.

ఆటో, రెండు బైకులు ఢీ

ఒకరి మృతి


నుజ్జునుజ్జు అయిన ఆటో


మృతి చెందిన రత్నం

రాజంపేట : రాజంపేట పట్టణ బైపాస్‌రోడ్డులో హెచ్‌పీ పెట్రోలు బంక్ సమీపంలో ఆటో, రెండు బైకులు ఆదివారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కడపకు చెందిన రత్నం (50) అనే వ్యక్తి మృతి చెందారు.. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 ద్వారా ప్రాంతీయవైద్యశాలకు తరలించారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం ఇద్దరిని తిరుపతికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పద్మశాలీయ సేవా సంఘం ప్రతినిధులు

అన్నమయ్య జిల్లా డీఈఓ సుబ్రమణ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : క్రమశిక్షణతో ఇష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నమయ్య జిల్లా డీఈఓ సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన పద్మశాలీయ విద్యార్థులకు నగదు, ప్రతిభ పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సుబ్రమణ్యం మాట్లాడుతూ కష్టపడితే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. ఏ పనినైనా ఇష్టపడి చేయాలని సూచించారు. తమ బిడ్డలు ఉన్నత స్థానాల్లో నిలబడితే తల్లిదండ్రుల ఆనందానికి అవధులు ఉండవన్నారు. పద్మశాలీయ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అవ్వారు వెంకటసుబ్బయ్య, అధ్యక్షుడు అవ్వారు సుబ్బరాయుడు మాట్లాడుతూ పద్మశాలీయ విద్యార్థులలో పోటీ తత్వాన్ని పెంపొందించి భవిష్యత్తులో వారు ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే ఉద్దేశంతో గత 19 సంవత్సరాలుగా నగదు ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎంసీ వెంకటసుబ్బయ్య, రాటాల గోపి, బీవీ సుబ్బారాయుడు, పుత్తా శివరామయ్య, బోడగల వెంకటరామయ్య, గొట్టుముక్కల వెంకటరమణయ్య, సోమా శంకర్, అవ్వారు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన చిన్న వెంకటసుబ్బయ్య

మైదుకూరు : మైదుకూరు – బద్వేలు రహదారిపై మున్సిపాలిటీ పరిధిలోని గోపిరెడ్డిపల్లె సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంపర్ల చిన్న వెంకటసుబ్బయ్య (60) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మైదుకూరు మీదుగా నెల్లూరు వైపు వెళుతున్న లారీ గోపిరెడ్డిపల్లె సమీపంలో నెల్లూరు నుంచి ఇంటి సామానుతో వస్తున్న గూడ్స్ ఆటోను, అలాగే జీవీ సత్రం నుంచి మైదుకూరు వైపు వస్తున్న ప్రయాణికుల ఆటోను ఒకే సారి ఢీ కొంది. సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఉప్పుగుంటపల్లెకు చెందిన వెంపర్ల చిన్న వెంకటసుబ్బయ్య అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో డ్రైవర్ నారాయణ, గూడ్స్ ఆటోలోని డ్రైవర్ మహమ్మద్ బాషా, షేక్షావలి, సింధూర మేషా అనే వారు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని అర్బన్ సీఐ కేవీ రమణారెడ్డి పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు

చాపాడు : మండల పరిధిలోని సోమాపురం దళితవాడలో ఆదివారం జరుగుతున్న బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నట్లు సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ తెలిపారు. సోమాపురం దళితవాడకు చెందిన అబ్బాయికి, పెద్దపసుపుల గ్రామానికి చెందిన 13 ఏళ్ల అమ్మాయితో ఆదివారం వివాహం జరిపేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో సమాచారం అందుకున్న ఐసీడీఎస్ అధికారులు పోలీసుల సహకారంతో గ్రామానికి వెళ్లి వివాహాన్ని అడ్డుకున్నారు. 13 ఏళ్ల అమ్మాయికి వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, వివాహానికి కారణమైన ప్రతి ఒక్కరికి శిక్ష పడుతుందన్నారు. అనంతరం బాలికను కడపలోని వసతి గృహానికి తరలించారు.

అల్లుడి హత్య కేసులో మామ, మరో ముగ్గురి అరెస్టు

- జువైనల్ హోంకు ఒకరి తరలింపు
- కడప చిన్న చౌక్ సీఐ ఓబులేసు వెల్లడి


హత్య కేసు నిందితుల అరెస్టు వివరాలను తెలియజేస్తున్న కడప చిన్నచౌక్ సీఐ ఓబులేసు

కడప అర్బన్ : కడప చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అశోక్ నగర్‌లో జూన్ 1వ తేదీన సయ్యద్ చాంద్ బాషా అనే యువకుడిని తాళ్లతో కట్టేసి క్రూరంగా హత్య చేసిన కేసులో మృతుడి మామతో పాటు భార్య , అత్త, బావమరిదిని అరెస్టు చేశారు. మరొక బావమరిదిని జువైనల్ హోంకు పంపినట్లు చిన్న చౌక్ సీఐ జి.ఓబులేసు తెలిపారు. కడప చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌లో సీఐ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య కేసు వివరాలు వెల్లడించారు. చాంద్ బాషా అలియాస్ చాను హత్య అనంతరం పారిపోయిన నిందితులపై నిఘా ఉంచారు. ఆదివారం సాయంత్రం వాటర్ గండి వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో మృతుడి మామ షేక్ మహబూబ్ బాషా , భార్య ఆయేషా, అత్త షేక్ ప్యారి, బావమరిది షేక్ మొహమ్మద్ రఫీ ఉన్నారు. ఈ కేసులో మరొక బావమరిది బాలుడు కావడంతో అతనిని జువైనల్ హోమ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు. మృతుడికి ముగ్గురు సంతానమని తెలిపారు. 2016 ఆగస్టు 25న ఆయేషాతో వివాహం కాగా ఆ తర్వాత వీరి మధ్య మనస్పర్థలు వచ్చాయన్నారు. దీంతో ఆయేషా గతంలో మృతుడిపై ఫిర్యాదు చేయడంతో గృహ హింస కేసు కూడా నమోదు చేశారు. రామకృష్ణ నగర్‌లో ఆయేషా పేరు మీద ఉన్న రేకుల షెడ్డును మృతుడు ఇతరులకు అమ్మడంతో మనస్పర్థలు తీవ్రమయ్యాయి. ఈ కారణంగా ఆయేషా కుటుంబ సభ్యులు అతన్ని చంపాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో అశోక్ నగర్‌లో రసూల్ అనే వ్యక్తి ఇంటిలో శుభ కార్య ఉండగా అక్కడికి వస్తాడని తెలుసుకొని పథకం రచించారు. ఆ ప్రకారం వేచి చూసి రసూల్ ఇంటి దగ్గర నుంచి రోడ్డు మీదకు రాగానే అక్కడే వేచి ఉన్న నిందితులు చాన్‌బాషాను మెడ పట్టుకుని బలవంతంగా ఇంటిలోనికి తీసుకెళ్లి, రెండు చేతులు కాళ్లు కట్టేశారన్నారు. ఆ తర్వాత ఇంటిలోకి ఎవరిని రానీకుండా అడ్డుకొని బలమైన మచ్చు కత్తితో చాంద్‌బాషాను అతి ఘోరంగా మెడ మీద ఐదు చోట్ల బలంగా నరకడంతో అక్కడికక్కడే మరణించాడు. ఈ హత్య కేసులోనిందితులను అరెస్టు చేసిన చిన్న చౌక్ సీఐ ఓబులేసు, ఎస్ఐ రాజ రాజేశ్వర్ రెడ్డి హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, శివకుమార్, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, ఖాదర్‌బాషా ,నాగరాజు, మాధవరెడ్డి, మహిళా కానిస్టేబుల్ శ్రీదేవి, మహిళా హోంగార్డు జి.ప్రభావతిలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు అభినందించినట్లు సీఐ తెలిపారు. వీరికి రివార్డుల కోసం సిఫార్సు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తను లేదని.. తనువు చాలించాలనుకున్నాడు

మదనపల్లె రూరల్ : భార్య మృతిని తట్టుకోలేక మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం ములకలచెరువు మండలంలో జరిగింది. దేవలచెరువుకు చెందిన సమీవుల్లా (26) గత నెల 21వ తేదీన భార్య అమ్మజాన్(21) కుమార్తె సుఫియా(ఆరు నెలలు)తో కలిసి ద్విచక్ర వాహనంలో వస్తుండగా పెద్దపాలెం గేటు వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అమ్మజాన్, సుఫియాలను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అమ్మాజాన్ మృతి చెందింది. సుఫియాకు చికిత్స పూర్తి అయిన తర్వాత ఇంటికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో సమీవుల్లా రోడ్డు ప్రమాదంలో భార్యను కోల్పోవడాన్ని జీర్ణించుకోలేక మనస్తాపంతో ఇంటివద్దే పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

కారు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్ : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం కురబలకోట మండలంలో జరిగింది. తుంగావారిపల్లెకు చెందిన రమణమ్మ (40), ఆమె భర్త రమణ(50), అదే గ్రామానికి చెందిన అమరమ్మ(55)తో కలిసి అంగళ్లులో జరిగిన మహిళా సమాఖ్య సమావేశానికి వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా అంగళ్లు మార్కెట్ వద్ద ఎదురుగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

చోరీ కేసుల్లో దొంగ అరెస్టు

40 గ్రాముల బంగారు నగలు స్వాధీనం


చోరీ కేసులో నిందితుడి అరెస్టు వివరాలను తెలియజేస్తున్న కడప చిన్నచౌక్ సీఐ ఓబులేసు

కడప అర్బన్ : కడప నగరంలోని పలు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన దొంగను చిన్న చౌక్ పోలీసులు ఆదివారం కడప ఎయిర్‌పోర్ట్ వద్ద అరెస్టు చేసినట్లు చిన్న చౌక్ సీఐ ఓబులేసు తెలిపారు. చిన్న చౌక్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం ఎస్ఐ రాజ రాజేశ్వర్ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కడప మోచంపేటలోని చిలకల బావికి చెందిన షేక్ అక్బర్ ఆలీ ఎలక్ట్రిషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. క్రికెట్ బెట్టింగ్, జూదం తదితర వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతూ వస్తున్నాడు. కడప నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఇతనిపై దాదాపు 20 కేసులకు పైగానే ఉన్నట్లు తెలిపారు. దొంగతనం కేసులో జైలుకు వెళ్లి తిరిగి వచ్చి దొంగతనాలకు పాల్పడుతూ వచ్చిన డబ్బుతో గోవా, ఢిల్లీ ప్రాంతాల్లో వెళ్లి తలదాచుకుంటూ తిరిగి మళ్లీ కడపకు వచ్చి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఇటీవల ఎన్జీవో కాలనీ, మత్యుంజయకుంట, అక్కాయపల్లెలో చోరీలకు పాల్పడి దొరికిన బంగారు నగలు తీసుకొని పారిపోతున్నట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి సిబ్బందితో నిందితుడు అక్బర్ ఆలీని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 40.160 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఫీల్డ్ అసిస్టెంట్లు

అట్లూరు : కడప–బద్వేలు ప్రధాన రహదారిపై లింగాలకుంట మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు పోరుమామిళ్ల మండలం రౌతుపల్లె ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ బత్తిన రమణయ్య, పోరుమామిళ్ల మండలం గానుగపెంటకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రామమోహన్ ఇరువురు అట్లూరు మండలం కామసముద్రంలో జరిగే అంకాలమ్మ తిరునాలకు వెళ్లారు. తిరిగి వస్తుండగా బద్వేలు వైపు నుండి కడపకు వెళ్తున్న కారు, ద్విచక్రవాహనం ప్రమాదవశాత్తు ఢీ కొన్నాయి. దీంతో ఇరువురు ఫీల్డ్ అసిస్టెంట్లు గాయపడ్డారు. వారిని 108 వాహనంలో బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

సాక్షి క్లాసిఫైడ్స్

SERIVCES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ ఫైనాన్స్ లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ (ఆర్బీఐ పాలసీ డిపార్ట్ మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. ఫోన్: 7382114847

PERSONAL CARE

CHANGE OF NAME

■ I Zahir Ahmed khateeb (Old Name) R/o 18/102 Syed Rasool St., Proddatur, YSR Dist. Have my name as Zahir Ahamed khateeb (New Name) S/o Khateeb Khaja Hussain.

WANTED

■ బిజినెస్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు -40వేలు, ఫ్రీ రూం+భోజనం. Hyd. 9014885406

■ Wanted Teachers Primary all subjects High school all subjects Vedas public school Cont: 7675920915, 9494074243

■ Wanted female telecallers, spot recruitment any graduation salary: 12K-18K good communication skill is must freshers and experienced are welcome call:7416210222 THEJA ASSOCIATES bisede rajiv park, Dr.mgr university office, aphb colony, Kadapa.

■ Wanted Qualified and Experienced Teachers for all Subjects for Sri Sai Concept School at Rayachoty. Attractive Salary for the right person. Contact: 70934 73533, ssvbrct@gmail.com

గమనిక

నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

48 దుంగలు, మోటారు సైకిల్ స్వాధీనం


నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తంబళ్లపల్లె : తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి 48 ఎర్రచందనం దుంగలు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు పోలీసుల కథనం మేరకు వివరాలు.. టాస్క్‌ఫోర్సు డీఎస్పీ బాలిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఐ చిరంజీవులు, ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందంగా శనివారం అటవీశాఖ అధికారులు జయప్రసాదరావు, మోహన్‌రెడ్డి, సబీన్‌తాజ్‌ల సహకారంతో వేపూరికోట ఫారెస్టుబీట్ పరిధిలో డంపింగ్ పాయింట్లను తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఆదివారం తంబళ్లపల్లె మండలం అన్నగారిపల్లె సమపంలోని వంకగట్టు వద్ద అనుమానాస్పదంగా పారిపోతున్న వారిని వెంబడించారు. ములకలచెరువు మండలం సోంపల్లి ఆర్.సుధాకర్(43), రాజుగారిపల్లెకు చెందిన ఈ.లక్ష్మిపతినాయుడు (27), పెద్దమండ్యం మండలం కురవపల్లెకు చెందిన మల్లికార్జున(39) గుర్రంకొండ మండలం మధ్యాహ్నంవారిపల్లెకు చెందిన సురేందరరెడ్డి (39) నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. పరిసర ప్రాంతాలు తనిఖీ చేయగా 48 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని దీంతో పాటు ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏరువమ్మ గుడిలో చోరీ

వీరబల్లి : మండలంలోని దిగువరాచపల్లి పంచాయతీ రాచపల్లి సమీపంలో ఉన్న ఏరువమ్మ దేవత గుడిలో శనివారం రాత్రి చోరీ చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన నాగభూషణం అనే వ్యక్తి ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి పూజలు చేసేందుకు వెళ్లగా ఆలయం తాళాలు పగులకొట్టి గుడిలో ఉన్న బీరువాను సైతం పగులగొట్టారు.

టిడ్కో ఇళ్ల సమీపంలో పశువధ కేంద్రం గుర్తింపు


పశువధ కేంద్రంలో స్వాధీనం చేసుకున్న కోడెదూడలు, ఆవులు


సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పలు సంఘాల నాయకులు

ఆవులు, కోడెదూడలు గోశాలకు తరలింపు

మదనపల్లె రూరల్ : మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ ఎర్రగానిమిట్ట వద్ద టిడ్కో ఇళ్లకు ఉత్తరం వైపున ఉన్న పాత కోళ్లఫారం షెడ్డులో రహస్యంగా పశువులను వధిస్తున్న విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. శానిటోరియం వద్ద ఆవును వధిస్తున్నారనే సమాచారం మేరకు..స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో కోళ్లఫారం షెడ్ వద్దకు చేరుకున్నారు. జంతు వధశాలను గుర్తించి సమాచారం ఉన్నతాధికారులకు చేరవేశారు. వారి ఆదేశాలతో తాలూకా పోలీసులు అక్కడకు చేరుకుని వధించేందుకు సిద్ధంగా ఉన్న 6 కోడెదూడలు, 1 దేశవాళీ ఆవు, 4 జెర్సీ ఆవులను గమనించి, వాటిని అక్కడి నుంచి తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ లోపు విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు బండి ఆనంద్, భగవాన్, వి.నారదరెడ్డి, విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ నాయకులు షెడ్ వద్దకు చేరుకున్నారు. బక్రీద్ సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీస్ కమిటీ సమావేశంలో...డీఎస్పీ మహేంద్ర మాట్లాడుతూ..గోవధ జరగకుండా చూస్తామని, దీనిని అరికట్టేందుకు డివిజన్ పరిధిలో మూడు చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారన్నారు. అయితే ఎవ్వరికీ అనుమానం రాకుండా గోవులను రహస్యంగా శానిటోరియం వద్దకు తరలించి, వధిస్తుంటే పోలీసులు ఎందుకు అరికట్టలేకపోయారని ప్రశ్నించారు. జంతు వధశాలలో స్వాధీనం చేసుకున్న గోవులను తీసుకువచ్చి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలపాలని బీజేపీ, వీహెచ్‌పీ, భజరంగదళ్ నాయకులు నిర్ణయించగా, పోలీసులు వారి ప్రయత్నాన్ని అడ్డుకుని పుంగనూరురోడ్డులోని నాగదేవత గోశాల ట్రస్ట్‌కు పశువులను తరలించారు. ఈ ఘటనపై తాలూకా సీఐ కళా వెంకటరమణ మాట్లాడుతూ.. టిడ్కో ఇళ్లకు సమీపంలో పశువధ జరుగుతోందన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి పరిశీలించగా కట్టివేసిన 10 పశువులను గుర్తించామన్నారు. పాత కోళ్లఫారం జాకీర్‌హుస్సేన్‌కి చెందినదిగా గుర్తించి, సుమోటోగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే రాత్రి 8 గంటల సమయంలో బీజేపీ నాయకులు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గోహంతకులను అరెస్ట్ చేయాలని ధర్నాకు పూనుకోవడంతో పోలీసులు బండి ఆనంద్, వి.నారదరెడ్డి, భగవాన్, మోహన్ తదితరులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.